RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 257 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం గురువారం, 21 మార్చి 2024 పేజీలు : 4 వెల : 2/-




# ఫైనల్ లిస్ట్ రెడీ

## గెలుపు గుర్రాలకే టీ కాంగ్రెస్ టిక్కెట్లు

### పూర్తయిన వడపోత!!

హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్త చాటాలని ప్రయత్నిస్తోంది. బీజేపీ ఈ సారి తెలంగాణ పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో వరుస చేరికలతో ఆ పార్టీలో కలకలం మొదలైంది. బీజేపీ ఇప్పటికే తమ అభ్యర్థులను ఖరారు చేసింది. కాంగ్రెస్ తమ అభ్యర్ధుల పైన నిర్ణయానికి వచ్చింది. తుది జాబితా ప్రకటనకు సిద్ధమైంది.

**ఎంపీ అభ్యర్ధుల ఎంపిక :** తెలంగాణలో పోటీ చేసే నలుగురు అభ్యర్ధులను ఇప్పటికే కాంగ్రెస్ ఖరారు చేసింది. బీజేపీ, బీఆర్ఎస్ తమ అభ్యర్ధుల పైన దాదాపు క్లారిటీ ఇచ్చాయి.

బీజేపీ అధికారికంగా తమ అభ్యర్ధులను ఖరారు చేసింది. దీంతో, ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ తెలంగాణలో అభ్యర్ధుల విషయంలో తన ఛాయిస్ ఏంటో స్పష్టం చేసారు. ప్రత్యర్ధి పార్టీల అభ్యర్ధులకు ధీటుగా తమ అభ్యర్ధుల బలా బలాలను వివరించారు. అందులో భాగంగా తాజాగా పార్టీలో చేరిన వారికి ఎక్కడ అవకాశం ఇవ్వాలనే దాని పైన నిర్ణయానికి వచ్చారు. రేవంత్ సూచనలతో పాటుగా వ్యూహకర్త సునీల్ కనుగోలు సూచనలతో పార్టీ ఎన్నికల కమిటీ తెలంగాణలో అభ్యర్ధుల ఎంపిక పైన ఒక నిర్ణయానికి వచ్చింది.

**రేవంత్ ఛాయిస్ :** కాంగ్రెస్ ఇప్పటికే మహబూబ్‌నగర్-వంశీచంద్ రెడ్డి, మహబూబాబాద్- బలరాం నాయక్, జహీరాబాద్ - సురేశ్ షెట్కార్, నల్లగొండ - కుందూరు రఘువీర్ రెడ్డి పేర్లను ప్రకటించింది. ఇప్పుడు పార్టీ నుంచి అందుతున్న సమాచారం మేరకు మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా సునీతా మహేందర్ రెడ్డి పేరు ఖరారు చేశారు. చేవెళ్ల అభ్యర్థిగా ఇటీవల పార్టీలో చేరిన రంజిత్ రెడ్డిని, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా దానం నాగేందర్‌ను ఎంపిక చేశారు. ఇక, నాగర్ కర్నూల్ అభ్యర్థిగా మల్లు రవి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ, మెదక్ నుంచి నీలం మధు, నిజామాబాద్ నుంచి జీవన్ రెడ్డి పేర్లు ఖరారయ్యాయి.

దీని ద్వారా తెలంగాణలో మరో ఏడు స్థానాలకు లోక్‌సభ అభ్యర్థులను కాంగ్రెస్ ఎన్నికల కమిటీ ఖరారు చేసింది. కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం దాదాపు మూడు గంటలపాటు జరిగింది.

**జాబితా సిద్ధం :** తెలంగాణ నుంచి పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ఈనెల 21న మిగిలిన ఆదిలాబాద్, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, భువనగిరి స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్ధులను ఎంపిక చేస్తున్నారు. సికింద్రాబాద్ స్థానం పైన రేవంత్ ప్రత్యేకంగా గురి పెట్టారు. ఇక్కడ దానం నాగేందర్ ను బరిలోకి దింపటం ద్వారా కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే, ప్రధాని మోదీ ఇప్పటికే కొద్ది రోజుల తేడాతో రెండు సార్లు ప్రచారం చేసారు. రేవంత్, ప్రియాంకను సైతం ప్రచారానికి రావాలని రేవంత్ ఆహ్వానించినట్లు తెలుస్తోంది.

# కవిత ఢిల్లీ లిక్కర్ కేసు నుండి బయటపడే అవకాశం ఉందా?

## బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చ!!




హైదరాబాద్ : ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ లిక్కర్ కేసు నుంచి బయటపడే అవకాశం ఉందా? ఈడీ విచారణ కొనసాగుతున్న సమయంలో, తన అరెస్టు అన్యాయమని సుప్రీంకోర్టు వేదికగా కవిత పోరాటం ఫలిస్తుందా? కవితను ఈడి అధికారులు విచారిస్తున్న క్రమంలో ఆమె నుంచి తీసుకుంటున్న సమాధానాలతో ఈడి ఉచ్చులో కవిత ఇరుక్కుంటుందా? పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కవితకేసును పక్కనపెట్టి బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఎన్నికలలో ముందుకు వెళ్లగలుగుతారా? అన్నది చర్చకు కారణంగా మారింది.

ఢిల్లీ లిక్కర్ కుంభకోణం లో అరెస్ట్ అయిన ఎమ్మెల్సీ కవిత ఈడి ఉచ్చు నుండి బయట పడటానికి శతవిధాల ప్రయత్నం చేస్తున్నారు. సుప్రీం కోర్టు పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తనను ఈడి అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ, తన రిమాండ్ ను రద్దు చేయాలని సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన కవిత, సుప్రీంకోర్టులో తనకు భారీ ఊరట దొరుకుతుందని భావిస్తున్నారు. కానీ సుప్రీంకోర్టులో కూడా కవితకు చుక్కెదురు అయ్యే అవకాశం ఉందని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అదే కనుక జరిగితే ఈ వారం రోజుల విచారణ అనంతరం, కవితను ఈడి మళ్లీ విచారణకు తీసుకునే అవకాశం ఉంది. లేదా ఇక ఇప్పుడు జరుగుతున్న విచారణలో కీలకమైన ఆధారాలు దొరికితే కవితను జైలుకు పంపే అవకాశం ఉంది.

ఈ క్రమంలో ఇటు పార్టీ శ్రేణులలోనూ , తెలంగాణ రాష్ట్ర ప్రజలలోను కవిత కేసులో ఏం జరగబోతుంది? కవిత ఈ వ్యవహారం నుంచి బయట పడతారా? అన్న చర్చ ఆసక్తికరంగా మారింది. పార్లమెంటు ఎన్నికల సమయంలో గులాబీ బాస్ కెసిఆర్ తమపార్టీ సత్తాచాటి అత్యధిక స్థానాలు గెలుచుకొని మళ్లీ పార్టీకి పునర్వైభవం తీసుకు రావాలనుకుంటే డామిడ్ కథ అడ్డం తిరిగింది అన్నట్టు కవిత అరెస్టు వ్యవహారం ఇప్పుడు తలనొప్పిగా మారింది. కవిత అరెస్టు వ్యవహారం నుండి కెసిఆర్ బయటకు రాగలుగుతారా? పార్లమెంటు ఎన్నికల పైన ఫుల్ ఫోకస్ పెట్టి ప్రజాక్షేత్రంలోకి వెళ్లగలుగుతారా? అన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఇక బి ఆర్ ఎస్ పార్టీలో కొనసాగితే తమ పరిస్థితి ఏమిటి? తాము కూడా కేసుల్లో ఇరుక్కోవలసి వస్తుందా? అన్న అనుమానం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు లేకపోలేదు.

ఈ క్రమంలోనే ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నేతలు కవిత కేసును జాగ్రత్తగా గమనిస్తున్నారు.

# తెలంగాణ సచివాలయంలో పబ్లిక్‌కు నో ఎంట్రీ!

హైదరాబాద్: దేశవ్యాప్తంగా జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చేసింది. తెలంగాణలో మే 13న లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో రాష్ట్రంలో కూడా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అటు సెక్రటేరియట్‌కు ఎన్నికల కోడ్ వర్తించడంతో మంత్రులను కలిసేందుకు వచ్చే ప్రజలకు నో ఎంట్రీ బోర్డు పెట్టేశారు అధికారులు. కోడ్ అమలులో ఉన్నందున మంత్రుల ఛాంబర్



కు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. శాఖల వారీగా పనులు ఉంటే తప్ప సెక్రటేరియట్‌లోకి అనుమతిపై ఆంక్షలు విధించారు. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. ప్రజలను ప్రలోభాలకు గురిచేసే ఏ కార్యక్రమాలను అమలు చేయొద్దంటూ ఈసీ నిర్ణయం తీసుకుంది. కోడ్ రాక ముందు నిత్యం వివిధ సమస్యలపై సెక్రటేరియట్‌కు పబ్లిక్ క్యూకట్టారు. కోడ్ అమల్లో ఉన్నందున అధికారిక నిర్ణయాలకు బ్రేక్ పడినట్లైంది. పెండింగ్ సమస్యలపై అధికారులను మాత్రమే కలిసేందుకు సచివాలయంలోకి ప్రజలను అనుమతి ఇస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సమస్యలు చెప్పుకునేందుకు సెక్రటేరియట్‌కు రద్దీ పెరిగిన విషయం తెలిసిందే. అయితే కోడ్ అమల్లోకి రాగానే సచివాలయంలోకి వెళ్లే పబ్లిక్‌కు తెలంగాణ సర్కార్ ఆంక్షలు విధించింది.

# నిలుస్తారా? కుప్పకూలుతారా?

## కేసీఆర్‌కు కాల పరీక్ష...



హైదరాబాద్ : నా అంతటివాడు లేడంటూ.. ఏడాదిన్నర కిందటి వరకు వ్యాఖ్యలు గుప్పించి.. దేశంలో చక్రం తిప్పుతాన న్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నిజంగా ఇప్పుడు కాలమే పరీక్ష పెడుతోంది. ఒకవైపు బీజేపీ, మరోవైపు కాంగ్రెస్‌ల రూపంలో ఆయనను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ రెండు పార్టీలకూ ప్రత్యామ్నాయంగా బీఆర్ ఎస్ మారబోతోందని చెప్పిన ఆయన అనేక పార్టీలను సమ్మిళితం చేసేందుకు కొన్నాళ్లు ప్రయత్నించారు. కానీ, ఢిల్లీలో వెలుగు చూసిన లిక్కర్ దందాలో కుమార్తె కవిత పేరు బయటకు రావడం.. తర్వాత జరిగిన పరిణామాలతో కేసీఆర్ రాజకీయంగా కుంగిపోయారు. అప్పటి వరకు మోడీని దించేస్తాం.. గుజరాత్కు పంపిస్తాం.. అన్న ఆయన.. కనీసం మోడీ పేరు ఎత్తకుండా నేగత అసెంబ్లీ ఎన్నికలను కానిచ్చేశారు. ఫలితంగా ఆయన బీజేపీతో కుమ్మక్కయ్యారనే పేరు తెచ్చుకుని.. ఇది అసెంబ్లీలో పార్టీ పలుచన చేసింది. మరోవైపు.. కూరలో కరివేపాకు అంటూ..చులకనగా చూసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు కొరకరాని కొయ్యగా మారిపోయారు. అంతేకాదు.. రేవంత్ కనుసైగ చేస్తే చాలు.. దాదాపు 15 - 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కండువా మార్చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్న నివేదికలు కేసీఆర్‌కు గుండెల్లో గుబులు రేపుతున్నాయి. పార్లమెంటు ఎన్నికలకు ముందు అనేక నాయకులు పార్టీ మారుతుండడం.. పోటీకి కూడా పెద్దగా ఎవరూ ఆసక్తి చూపకపోవడం.. కేసీఆర్‌కు భారీ అగ్నిపరీక్షగా మారిపోయింది. ప్రస్తుతమున్న పరిస్థితిని అధిగమించి పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటితే.. కేసీఆర్ పార్టీకి మెరుగులు ఉంటాయి. లేకపోతే.. వచ్చేఎన్నికల నాటికి.. బీఆర్ ఎస్ స్థానాన్ని బీజేపీ భర్తీ చేసినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదనే వాదన బలంగా వినిపిస్తోంది.

పైగా అప్పటికి.. కేసీఆర్ ఇప్పుడున్నంత ఉత్సాహంగా ముందుకు సాగే పరిస్థితి ఉండకపోవచ్చు. కేటీఆర్‌పై బీఆర్ ఎస్ నాయకుల్లో పెద్దగా విశ్వాసం లేకపోవడం.. కూడా పార్టీకి శరాఘాతంగా మారుతోంది. సో.. ఈ కాల పరీక్షను కేసీఆర్ ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ప్రవీణ్ కుమార్ లెక్కేంది? కేసీఆర్ ను నమ్మేదేంది?

తెలంగాణ పోలీసు విభాగంలో బోలెడంత మంది ఆఫీసర్లు ఉన్నా.. మిగిలిన వారికి కాస్త భిన్నంగా వ్యవహరించటమే కాదు.. సంచలన నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తారు మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. తన స్ఫూర్తి వంతమైన మాటలతో మనసుల్ని దోచుకునే ఆయన.. తాజాగా గులాబీ కారును ఎక్కేసిన వైనం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నిన్నటికి నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ గురించి చెబుతూ.. తాను టీఎస్ పీఎస్ బిగ్ బాస్ పోస్టును చేపట్టాలంటూ ఆఫర్ ఇచ్చానని.. కానీ ఆయన మాత్రం అందుకు అంగీకరించలేదన్న కొత్త విషయాన్ని తెర మీదకు తీసుకొచ్చారు. నిరుద్యోగ యువత బతుకును మార్చేందుకు లభించిన పెద్ద అవకాశాన్ని వదిలేసి.. అధికారంలో లేని పార్టీలో చేరుడేందన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఇంతకూ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సీఎం రేవంత్ ఇచ్చిన అవకాశాన్ని ఎందుకు నో చెప్పినట్లు? అధికారం చేతిలో లేని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందు చేతులు కట్టుకొని పార్టీలో చేరేందుకు ఎందుకు సిద్ధమైనట్లు? నిరుద్యోగులకు సాయం చేయాల్సిన విషయాన్ని వదిలేసి.. రాజకీయ పార్టీల్లో మారే అంశం మీదా ఫోకస్ పెట్టటం ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది. అధికారానికి దూరంగా.. ప్రతిఫక్షంలో ఉన్న పార్టీతో చెట్టాపట్టాలు వేసుకుంటూ తిరుగుతుంటే భారీగా ప్రయోజనం ఉంటుందన్న వాదనలో పస లేదన్నఅభిప్రాయం వ్యక్తమవుతోంది. కేసీఆర్ అధికారంలో ఉన్న వేళలో.. ఇదే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగేవారు. సీఎం హోదాలో కేసీఆర్ ఇచ్చిన హామీల్ని అమలు చేసే విషయంలో వైఫల్యం చెందినట్లుగా ఆరోపించేవారు. ముడుపులు తీసుకొని పనుల్ని పక్కన పెట్టేశారన్న వాదనను వినిపించారు. మొత్తంగా నిన్న మొన్నటి వరకు కేసీఆర్ ను చావు తిట్లు తిట్టిన ప్రవీణ్ ఈరోజున ఆయన పార్టీలో చేరటంలో లాజిక్కు ఒక పట్టాన అర్థం కాని పరిస్థితి. తాను కష్ట కాలంలో ఉన్నప్పుడు గులాబీ కారులో ఎక్కిన ప్రవీణ్ కు పార్టీలో పెద్ద పదవిని ఇస్తామని కేసీఆర్ చెప్పిన వైనం చూస్తే.. నాటకాన్ని మరింత రక్తి కట్టించేలా ఉందని చెప్పాలి. మొన్నటి వరకు పెద్ద పెద్ద మాటలు.. ఆదర్శాల్ని వల్లించిన ప్రవీణ్ సారు.. ఈరోజు పెద్ద సారును కలుసుడే కాదు.. ఆయన పార్టీలో చేరుడు వెనుకున్న లాజిక్కును అర్థమయ్యేలా చెబితే బాగుంటుంది. అలాంటిదేమీ లేకుండా గులాబీ కండువా మెడలో కప్పించుకోవటాన్ని ఆయన్ను అభిమానించిన వారు అర్థం చేసుకోలేక తలలు బద్ధలు కొట్టుకుంటున్న పరిస్థితి. అంతేకాదు.. ప్రవీణ్ ను అభిమానించిన వారి నోటి నుంచి తాజాగా వస్తున్న మాట ఒక్కటే.. ప్రవీణ్ సారు లెక్కేంది? పెద్ద సారును నమ్మేదేంది? అని. దీనికి సరైన సమాధానం చెప్పేవారెవరు?

## ఆందోళన వీడితేనే విజయం



మెట్‌పల్లి : పదో తరగతి విద్యార్థులు ఆందోళన, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ప్రారంభమయ్యే పది పరీక్షలు రాసే విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టుల పరంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉత్తమ మార్కులు సాధించేలా పూర్తిస్థాయిలో తర్ఫీదు ఇచ్చారు.

సమయపాలన ముఖ్యం..– రాజన్న, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు

పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తప్పకుండా సమయపాలన పాటించాలి. పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకుంటే హాల్‌టికెట్ నంబర్ చూసుకుని కేటాయించిన సీటులో కూర్చోవచ్చు. దీంతో ఆందోళన, ఒత్తిడి దరిచేరకుండా ఉంటుంది.

తల్లిదండ్రులు ధైర్యం చెప్పాలి..

–శివానందం, విశ్రాంత ఉపాధ్యాయుడు

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లే సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికావద్దు. ప్రశాంతమైన, చిరునవ్వుతో వెళ్లాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ధైర్యం చెప్పాలి.

ఒకరోజు ముందే..– అశోక్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

ఒకరోజు ముందే మరుసటి రోజు పరీక్షకు సంబంధించిన సబ్జెక్టు విషయాలను చదివి అవగాహన చేసుకోవాలి. ప్రతి పాఠ్యాంశంలో ముఖ్యమైన ప్రశ్నలను ఎంచుకుని సమాధానాలను గుర్తుంచుకోవాలి. దీంతో పరీక్షలో సులువుగా రాసేందుకు అవకాశం ఉంటుంది.

టీవీ, చరవాణులకు దూరంగా ఉండాలి– కోటగిరి ఆనందం, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఇంటివద్ద చరవాణులు, టీవీలకు దూరంగా ఉండాలి. స్నేహితులతో కలిసి తిరగడాలు బంద్‌చేసి దృష్టంతా పరీక్షలపై పెట్టాలి. అర్థంకాని విషయాలను అడిగి నివృత్తి చేసుకోవాలి.

## పారిశ్రామిక ప్రాంతం.. మెరుగైన వైద్యం



గోదావరిఖని : వంద పడకల సామర్థ్యంతో ఉన్న గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య కళాశాలకు అనుబంధంగా పడకల స్థాయి పెంచుతూ సార్వజనిక ఆసుపత్రిగా అన్ని రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్టీపీసీ సహకారంతో ఆసుపత్రి భవనంపై మరో అంతస్తు నిర్మాణంతో కొంతమేరకు ఉపశమనం కలిగినప్పటికీ ఆసుపత్రిలో వార్డులు, వైద్యుల గదులతో పాటు వివిధ విభాగాలకు సరిపడా భవనాలు లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో రూ.142 కోట్లతో ఐదు అంతస్తుల్లో 355 పడకల సామర్థ్యంతో ఆసుపత్రి ఆవరణలో చేపట్టిన అదనపు భవన నిర్మాణం పూర్తయితే కార్పొరేట్ స్థాయిలో వివిధ రకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి గదులు, వార్డులతో ఉన్నంతలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రయత్నాలు సాగుతున్నప్పటికీ కీలకమైన విభాగాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు రెండేళ్ల క్రితం ఆసుపత్రి స్థాయిని ప్రభుత్వం పెంచినప్పటికీ పూర్తిస్థాయిలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరేందుకు మరో ఏడాది కాలం పట్టే అవకాశముంది.

దశలవారీగా భవన నిర్మాణాలు

సుమారు రెండు దశాబ్దాల క్రితం వంద పడకల సామర్థ్యంతో రెండంతస్తుల్లో గోదావరిఖనిలో ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఏర్పాటు చేయడంతో అప్పట్లో పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వచ్చినట్లయింది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంతో పాటు మంథని, మహదేవపూర్, మంచిర్యాల, పెద్దపల్లి ప్రాంతాల నుంచి గర్భిణులు, రోగులు ఆసుపత్రికి అధిక సంఖ్యలో వస్తుండటంతో రద్దీ తీవ్రమైంది. ప్రసవాల్లో రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఆసుపత్రి నిర్వహణలో ఇబ్బందులను గుర్తించిన ఎన్టీపీసీ యాజమాన్యం అంబులెన్సులతో పాటు ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన పడకలు, వివిధ రకాల పరికరాలను పంపిణీ చేయడంతో పాటు దాదాపు రూ.7 కోట్ల వ్యయంతో మరో అంతస్తు నిర్మాణం చేపట్టింది. గోదావరిఖనిలో వైద్య కళాశాల ఏర్పాటు ప్రక్రియ మొదలు కావడంతో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో 85 పడకల సామర్థ్యంతో మరో భవన నిర్మాణం పూర్తిచేయగా వినియోగంలోకి వచ్చింది. రక్తశుద్ధి కేంద్రంతో పాటు అత్యవసర, సాధారణ చికిత్స వార్డులను, కొన్ని విభాగాల వైద్య పరీక్షలను అందులోకి తరలించారు. దీంతో పాత భవనంలో కొంత గదుల కొరత తీరింది. తాజాగా రూ.23 కోట్ల వ్యయంతో 50 పడకల సామర్థ్యంతో క్రిటికల్ కేర్ విభాగం భవన నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. అత్యాధునిక వసతులతో రక్తనిధి భవన నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చినప్పటికీ ఆయా యంత్రాల వినియోగానికి ఔషధ నియంత్రణ మండలి అనుమతి రావాల్సి ఉంది. తాజాగా 355 పడకలతో అదనపు భవన నిర్మాణం పూర్తయితే రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

పెరుగుతున్న వైద్య సిబ్బంది

గతంలో రక్త, మూత్ర పరీక్షల లాబొరేటరీల్లో నామమాత్రమైన పరీక్షలు మాత్రమే నిర్వహిస్తుండే వారు. ఆసుపత్రి స్థాయి పెరగగానే ఆయా విభాగాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. సీటీ స్కాన్ సదుపాయం అందుబాటులోకి రాగా త్వరలోనే ఎం.ఆర్.ఐ. ఏర్పాటు చేసే అవకాశముంది. ఇప్పటికే 100 మంది నర్సింగ్ సిబ్బంది ఉండగా తాజాగా మరో 250 మందిని ప్రభుత్వం నియమించింది. గుండె వ్యాధులను మినహాయిస్తే దాదాపుగా అన్ని రకాల విభాగాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరిగినా కొంతమేర కొరత ఉంది. దీనిని తీర్చేందుకు తాజాగా ఒప్పంద విధానంలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల కొంత కాలంగా గుండెపోటుతో అత్యధిక మంది మృత్యువాత పడుతున్న నేపథ్యంలో అత్యాధునిక చికిత్స వసతులతో ఆసుపత్రిలో అత్యంత నిపుణులైన వైద్యులతో గుండె వ్యాధుల విభాగాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.

## టీజీ కోడ్.. రవాణా శాఖకు కాసులు



కరీంనగర్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కొత్త కోడ్ అమల్లోకి వచ్చింది. ఇది రవాణా శాఖకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ నెల 15న కోడ్ ప్రారంభమైన మొదటి రోజే నాలుగు జిల్లాల పరిధిలో భారీగా ఆదాయం సమకూరింది. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు, ఫ్యాన్సీ నంబర్లకు సంబంధించి రూ.2.51 కోట్ల ఆదాయం రాగా, కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.14.79 లక్షలు సమకూరాయి. కోడ్‌తో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖకు వచ్చిన ఆదాయంపై కథనం.

టీజీ 21 తి 0007 రూ.1.21 లక్షలు..

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లలో జిల్లా రవాణా శాఖ కార్యాలయాలు ఉండగా హుజూరాబాద్, కోరుట్ల, రామగుండంలో యూనిట్ కార్యాలయాలు సేవలందిస్తున్నాయి. అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో టీజీతోపాటు 0001 కొత్త సిరీస్ ప్రారంభం కావడంతో ఫ్యాన్సీ నంబర్లకు వాహనదారులు ఆసక్తి చూపారు. ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ వేశారు. జగిత్యాల ఆర్టీఏ కార్యాలయ పరిధిలోని కోరుట్లలో టీజీ 21ఏ 0007 ఏకంగా రూ.1,21,000తో కోట దుర్గరాజు దక్కించుకున్నారు. తర్వాత స్థానాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో టీజీ 23, 0009 నంబర్‌కు రూ.1,20,000 పలకగా లింగాల మల్లయ్య, కరీంనగర్‌లో టీజీ 02 0001 నంబర్‌కు 1,0,2003 తుపాకి రవీందర్ చేజిక్కించుకున్నారు. పెద్దపల్లిలో టీజీ 22 0009కు రూ.57000 ధర పలికింది. ఫ్యాన్సీ నంబర్లకు అధికారులు ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ నిర్వహించగా వాహనదారుల నుంచి మంచి స్పందన లభించింది. 0007, 0009 నంబర్లకు పోటీ కనిపించింది. ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్న వాహన దారులకు మాత్రం పాత టీఎస్ కోడ్‌తో రిజిస్ట్రేషన్ చేయగా, కొత్త వాహనాలు కొనుగోలు చేసిన వారికి మాత్రం టీజీ కోడ్ కేటాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.9,28,000, ఫ్యాన్సీ నంబర్లతో రూ.5,51,904 రాగా.. మొత్తం రూ.14,79,904 ఆదాయం సమకూరింది.

## డబుల్ ఆనందం లేనట్లే..!

మిర్యాలగూడ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం ప్రారంభించిన నేపథ్యంలో.. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రెండు పడక గదుల ఇళ్లను రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గత ప్రభుత్వం తొమ్మిదేళ్లలో వందల సంఖ్యలో మాత్రమే నిర్మాణాలు చేపట్టగా.. చాలా చోట్ల లబ్ధిదారులకు కేటాయింపులు జరపలేదు. ఏడాదిన్నర కిందట పట్టణాల్లో, గ్రామాల్లో డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ వారికి ఇళ్లను కేటాయించలేదు. గతంలో మంజూరై నిర్మాణంలో ఉన్న రెండు పడకల



ఇళ్లు చాలా చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. పనులను పూర్తి చేయటంతో పాటుగా ప్రారంభం కాని పనులను రద్దు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల ప్రస్తుత పరిస్థితులను సేకరించి నివేదిక పంపాలని ఉన్నతాధికారులకు ఆదేశాలందాయి.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 17,884 రెండు పడకల ఇళ్లు గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటివరకు 6576 మాత్రమే పూర్తయ్యాయి. 1512 నిర్మాణ దశలో ఉన్నాయి.. 8209 కనీసం నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో ప్రారంభించని ఇళ్లను రద్దు చేయనున్నారు. ఎన్నికల ముందు గృహజ్యోతి పేరుతో గత ప్రభుత్వం దరఖాస్తులు తీసుకోగా.. ఈ పథకాన్ని సైతం ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. రెండు పడకల ఇళ్ల సమాచారం ఉన్నతాధికారులకు పంపామని గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు.

## చిగురిస్తున్న సాగునీటి ఆశలు

నర్వ : నర్వ మండలంలో 15వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన చంద్రగడ్, బెక్కరపల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాలపై అన్నదాతలకు ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల సంగంబండకు వచ్చిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వీటి మరమ్మతులకు నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. కళ్ల ముందు పుష్కలంగా నీళ్లు ఉన్నా.. పొలాలకు పారక కన్నీళ్లు పెట్టిన రైతన్నల మోహాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సాగునీటి పారుదల శాఖ అధికారులు ఈ మూడు ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ఆగమేఘాల మీద ప్రతిపాదనలు పంపారు.

ఇదీ పరిస్థితి: జూరాల ప్రాజెక్టు నిల్వనీటి ఆధారంగా చేపట్టిన చంద్రగడ్, బెక్కరపల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి 2005లో అప్పటి ప్రభుత్వం రూ. 50కోట్ల నిధులు మంజూరు చేసింది. ఒక్కో పథకం పరిధిలో 5వేల ఆయకట్టు మొత్తం 15వేల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్దేశించింది. పనుల బాధ్యతను చేపట్టిన గుత్తేదారు అయిదేళ్లు నాసిరకం పనులు చేసి పథకం నిర్వహణ బాధ్యతలను రైతులకు అప్పగించారు. నాణ్యత లేని పైపులు కావడంతో ఎక్కడికక్కడే పైపులు పగిలిపోయి నిర్వహణ పూర్తిగా గాడితప్పింది. ప్రతిఏటా పైపులు పగిలిపోయి పంటలు నష్టపోయిన సందర్భాలు కోకొల్లలు. పైపులను మార్చాలని గత ప్రభుత్వ హయాంలో అనేకసార్లు నిధుల



విడుదలకు ప్రతిపాదన పంపినా ఒక్కపైసా విడుదల చేయలేదు. దీంతో ఈ మూడు పథకాలు మూతపడటంతో రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు.

పైపులు మారిస్తే ప్రయోజనం: ప్రధాన సంపుహౌజ్ నుంచి ఒక్కో ఫేజుకు నీరందించే ప్రధాన పైపులు మార్చాలి. నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకం ప్రధాన గ్రావిటీ పైపులైన్ తుప్పుపట్టి రంధ్రాలు పడ్డాయి. చాలాచోట్ల చిల్లులుపడి నీరంతా వృథాగా పోయిన సందర్భాలు అనేకం. బెక్కరపల్లి ఎత్తిపోతల పథకం నుంచి పంట పొలాలకు నీరందించేందుకు పిల్ల కాల్వలను పూడికతీసి కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతోపాటు సంపుహౌజ్‌లో రూ.లక్షల విలువగల విద్యుత్తు ప్యానెల్‌బోర్డు పాడైపోవడంతో ఏళ్లుగా ఎత్తిపోత ఆగింది. అమరచింత విద్యుత్తు ఉపకేంద్రం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విద్యుత్తు స్తంభాలను మార్చాలని అధికారులను కోరినా ఏళ్లుగా పట్టించుకోలేదు. నిధులు లేక.. నీళ్లు రాక రైతన్నలు ఇబ్బందులు పడ్డారు.

రూ. 2కోట్లకు ప్రతిపాదన : బెక్కరపల్లి ఎత్తిపోతల పథకంలో పైపులైన్ లీకేజీలను సరిచేయడంతో పాటు ఆర్‌సీసీ, పీఎస్‌సీ పైపులైన్స్ కొత్తవి చేపట్టేందుకు నిర్ణయించారు. గ్రావిటీలో ఏర్పడిన లోపాలను సరిచేయాలి. వీటికి రూ.10.30లక్షలు ప్రతిపాదించారు. నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించి గ్రావిటీ కెనాల్, పైపులైన్ మార్చాల్సి ఉంది. చిన్న సంపుహౌజ్‌లను నిర్మించాల్సి ఉన్న క్రమంలో మరమ్మత్తు కోసం రూ.99.10లక్షలు ప్రతిపాదించారు. చంద్రగడ్ పథకంలోని ప్రధాన పైపులను మార్చేందుకు అవసరమైన రూ.11.50 లక్షలు అవసరమైన నివేదిక పంపారు. వీటితో పాటు సంపుహౌజ్‌లోని సాంకేతిక సమస్యలను సరిచేసేందుకు, విద్యుత్తు ప్యానెల్‌బోర్డు ఆధునికీకరణ పనులను చేపట్టనున్నట్లు ఆ శాఖ అధికారులు వెల్లడించారు.

త్వరలోనే మరమ్మతులు : చంద్రగడ్, బెక్కరపల్లి, నాగిరెడ్డిపల్లి ఎత్తిపోతల పథకాలను ఆధునికీకరించేందుకు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి ఆదేశానుసారం ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు విడుదల చేస్తామని మంత్రి చెప్పడంతో లోపాలను పూర్తిస్థాయిలో సరిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తాం. ఇరిగేషన్ ఏఈ ఆంజనేయులు

# వడ్డీ మాఫీ గోల

కామారెడ్డి : ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీమాఫీ చేస్తూ పురపాలకశాఖ నిర్ణయం తీసుకున్నా అనేక మందిలో అయోమయం నెలకొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని 10 శాతం వడ్డీతో ఏకకాలంలో చెల్లించేలా అవకాశం కల్పించింది. 90 శాతం మాఫీ పొందేలా 'వన్‌టైం సెటిల్‌మెంట్' కింద చెల్లించడానికి అవకాశం కల్పించారు. కానీ ఆన్‌లైన్‌లో ఈ ఆర్థిక సంవత్సరం బిల్లు చెల్లించాలనుకునేవారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి యజమానులు గందరగోళానికి గురవుతున్నారు.

ఓ వైపు విస్తృత ప్రచారం

జిల్లాలోని పురపాలికల పరిధిలో వార్డుల్లో సామాజికమాధ్యమాలు, మైకుల ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఈ నెల 31లోగా బకాయిలను వడ్డీ మొత్తంలో కేవలం పది శాతాన్ని కలిపి చెల్లిస్తే సరిపోతుందని అవగాహన కల్పిస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద హోర్డింగ్‌లు ఏర్పాటుచేశారు. యజమానులు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బకాయిలను చెల్లించాలని ప్రయత్నిస్తే '90 శాతం వడ్డీ మాఫీకి అర్హులు' అని చూయిస్తోంది. తీరా బిల్లు కట్టే సమయంలో ప్రక్రియ పూర్తి కావడం లేదు. 2022-23 వరకు బకాయిలు చెల్లించేందుకు ఏ అడ్డంకీ లేదు. కాగా శతశాతం వడ్డీతో




గత ఆర్థిక సంవత్సరాల్లో కొందరు బకాయిలు చెల్లించారు. అలాంటి వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో సర్దుబాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వడ్డీ మాఫీ లభిస్తుందో లేదోనని చెల్లింపుదారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

సర్దుబాటు చేసేలా చర్యలు

– సుజాత, పురపాలక కమిషనర్–కామారెడ్డి బకాయి ఆస్తి పన్నుపై వడ్డీలో 90 శాతం మాఫీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఇదివరకు పన్నులు చెల్లించిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో సర్దుబాటు చేసేలా చర్యలు చేపడతాం. ఈ నెలాఖరు వరకు కార్యాలయానికి వచ్చి లేదా ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించాలి.

# జీవనభృతి అందేదెన్నడో..!



కామారెడ్డి : బీడీలు చుడుతున్న వీరు దోమకొండకు చెందిన అనూష, జ్యోతి, రజిత. 2016లో బీడీ కార్మికులుగా వీరికి పీఎఫ్ కార్డు వచ్చింది. గత భారాస ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం జీవనభృతి పింఛన్‌కు తేదీ కటాఫ్ లేకుండా, బీడీ కార్మికులందరు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయిస్తామని ప్రకటించింది. దీంతో వీరు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకు రాలేదు. ఇలా దోమకొండ మండలంలో రెండు వేలకు పైగా బీడీ కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. అవి ఇంకా అలాగే మూలుగుతూనే ఉన్నాయి.

బీడీ కార్మికులకు ఆసరానిచ్చేందుకుగాను గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవనభృతి పింఛను కార్మికులందరికీ వర్తించకపోగా నిరాశలో ఉన్నారు. ఎన్నికల ముందు భారాస, కాంగ్రెస్ పెద్దలు బీడీ కార్మికులందరికీ జీవనభృతి పింఛన్ మంజూరునిస్తామని హామీలు ఇచ్చినా.. కార్యాచరణ మాత్రం చతికిలపడిపోయింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ 20 వేల మంది బీడీ కార్మికులు జీవనభృతి పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఈ విషయంలో ఎటువంటి స్పష్టత ఇవ్వకపోగా నిరసన వ్యక్తమవుతోంది.

మూలుగుతున్న దరఖాస్తులు

భారాస ప్రభుత్వం 2022 నవంబరులో కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ జీవనభృతి మంజూరు చేస్తామని ప్రకటించింది. అదే నెలలో దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందజేయాలని కోరింది. జిల్లావ్యాప్తంగా నెలరోజుల వ్యవధిలో 16,316 దరఖాస్తులు వచ్చాయి. ఆయా గ్రామ పంచాయతీల నుంచి దరఖాస్తులు మండల పరిషత్ కార్యాలయానికి చేరగా, వాటి వివరాలను జిల్లా కార్యాలయానికి పంపించారు. దరఖాస్తులను స్వీకరించిన భారాస ప్రభుత్వం తమ హయాంలో జీవనభృతిని మంజూరు చేయలేకపోయింది. ఆత్రుత, ఆశతో కార్యాలయాల్లో ఉంచిన దరఖాస్తులు ఏడాదిన్నరగా మూలుగుతుండగా బూజు పట్టిపోతున్నాయి.

కటాఫ్ తేదీ సవరణపై స్పష్టత కరవు

గతంలో భారాస ప్రభుత్వం జీవనభృతి మంజూరుకు 2014 ఫిబ్రవరి కటాఫ్ తేదీగా నిర్ణయించింది. చాలా మంది బీడీ కార్మికులకు జీవనభృతి రాకపోగా ప్రభుత్వానికి విన్నవించారు. వారి నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. 2022 నవంబరులో కటాఫ్ తేదీని సవరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు సంబంధించిన సవరణ జీవో ఏదీ రాకపోగా అధికారికంగా స్పష్టత ఇవ్వలేకపోయింది. దరఖాస్తులన్నీ ఆఫ్‌లైన్‌లోనే ఉండిపోగా.. వీటి నమోదు, మంజూరు ప్రక్రియకు సంబంధించి ఆన్‌లైన్ వెబ్‌సైట్ తెరుచుకోలేదు. భారాస హయాంలో జీవనభృతి పింఛన్లు మంజూరవుతాయని ఎదురుచూసిన బీడీ కార్మికులకు మొండిచేయి మిగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, ఇప్పటికీ జీవనభృతి పింఛన్ల మంజూరు ఊసేలేదు. ప్రభుత్వం చొరవ చూపి, సమస్యను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.

# గ్రేటర్‌లో సౌర విద్యుత్‌పై కొత్త ఆశలు

హైదరాబాద్: నగరంలో భవనాలపై సగటున ప్రతిరోజు ఉత్పత్తి అవుతున్న సౌర విద్యుత్తు 1 మిలియన్ యూనిట్ మార్క్‌కు చేరువైంది. 18 వేల భవనాలపై సౌర యూనిట్ల ఏర్పాటుతో కాలుష్య రహితమైన కరెంటు ఉత్పత్తి అవుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం రోజువారీ విద్యుత్తు వినియోగం 70 మిలియన్ యూనిట్లు ఉండగా.. 1 మిలియన్ లోపు అంటే ఇప్పటికీ ఒక శాతంలోపే భవనాలపై సౌర విద్యుత్తు వస్తోంది. దీన్ని మరింతగా పెంచేందుకు అవకాశముందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇటీవల మోదీ ప్రారంభించిన పీఎం సూర్యాఘర్‌పై ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. నగరంలోని మెట్రో, మేడ్చల్, రంగారెడ్డి జోన్ల పరిధిలోకి వచ్చే తొమ్మిది సర్కిళ్లలో భవనాలపై సౌర విద్యుత్తు యూనిట్ల సామర్థ్యం 227 మెగావాట్లకు చేరింది. సంగారెడ్డి సర్కిల్ పరిధిలోకి వచ్చే పటాన్‌చెరు, తెల్లాపూర్ చుట్టుపక్కల నివాసాలు, విల్లాలు, వాణిజ్య భవనాలపై ఏర్పాటుచేసిన యూనిట్లను కలిపితే ఉత్పత్తి సామర్థ్యం 285 మెగావాట్లకు చేరుతోంది.

ఏడాదిలో భారీగా



గత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి నగరంలో 210 మిలియన్ యూనిట్ల సౌర విద్యుత్తు ఇంటి పైకప్పులపై ఉత్పత్తి అయ్యింది. ఈ ఏడాది ఏకంగా 289 మిలియన్ యూనిట్లకు పెరిగింది. సంగారెడ్డి సర్కిల్‌లో ఉత్పత్తి అయినది దీనికి అదనం. ఇవన్నీ కలిపితే సగటున రోజుకు ఒక మిలియన్ యూనిట్ల మార్క్‌కు సౌర విద్యుత్తు చేరువైంది. వినియోగదారులు వాడుకోగా మిగిలినది నెట్‌మీటర్ల ద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

మేడ్చల్‌లో అత్యధికం

నగరం పరిధిలోని సర్కిళ్లల్లో మేడ్చల్‌లోనే భవనాలపై ఏర్పాటుచేసిన సౌర విద్యుత్తు సామర్థ్యం అత్యధికంగా ఉంది. ఇక్కడ 50 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాట్లు చేసుకున్నారు. తర్వాత రాజేంద్రనగర్‌లో 37 మెగావాట్లు, సైబర్‌సిటీలో 36 మెగావాట్లు, హబ్సిగూడలో 32 మెగావాట్లు ఉత్పత్తి అవుతోంది.

# కొత్తవి రావు.. పాతవి బాగుపడవు

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పారిశుద్ధ్య పనుల నిర్వహణలో దేశవ్యాప్త గుర్తింపు సాధించింది. సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్‌లో నగదు పురస్కారం దక్కించుకోవడానికి ప్రధాన కారణం వాహనాలు, యంత్రీకరణతో పనులు నిర్వహించడమే. అలాంటి వాహనాలకు మరమ్మతులు లేకపోవడంతో ఒక్కొక్కటిగా మూలకు పడుతున్నాయి. నీటి సరఫరాకు సంబంధించిన ట్యాంకర్ల పరిస్థితి అలాగే ఉంది. అత్యవసర సేవలకు వీటిని వినియోగిస్తుండగా మరమ్మతు చేయాలని కార్మిక సంఘాలు తెలపడంతోనే అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ప్రత్యేకంగా ఇంజినీరింగ్ అధికారులు ఉన్నా పట్టనట్లుగా ఉండటంతో క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులపై ప్రభావం పడుతోంది. రహదారులు ఊడ్చేందుకు స్వీపింగ్ యంత్రాలు వాడుతుండగా అవీ చెడిపోయాయి.

ఫిర్యాదు చేసినా పరిష్కారమేదీ?

వాహనాలు మరమ్మతు చేయాలని సీఐటీయూ, బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నాయకులు పలుమార్లు కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ప్రత్యేకంగా వాహనాల మరమ్మతుల షెడ్డు ఉన్నా మరమ్మతులు మాత్రం పూర్తిస్థాయిలో జరగడం లేదు. వాటిని బలవంతంగా నడిపిస్తుండగా ఇంజిన్ పాడయ్యే ప్రమాదముందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

ట్యాంకర్లు వదిలేశారా?



నీటి విభాగంలోని లోలెవల్ మార్కెట్ ట్యాంకుకు మూడు, హైలెవల్ జ్యోతినగర్ రిజర్వాయర్‌కు నాలుగు కొత్త ట్యాంకర్లు అవసరముంది. బ్లేడ్ డోజర్, క్లచ్ ప్లేట్లు, పెద్ద టైర్లు వంటివి అవసరముంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి త్వరగా మరమ్మతులు చేయడంతోపాటు కొత్త వాహనాలు తీసుకోవాలని కార్పొరేటర్లు, కార్మికులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య వాహనాల్లో సమస్యలు ఇవి

కంప్యాక్టర్ వాహనాల్లో టైర్లు వేయించాలి. డబ్బాలు కొత్తగా 150 తెప్పించాలి. వీటికి చిన్న చిన్న మరమ్మతులు, వెల్డింగ్ చేయాల్సి ఉంది. డంపర్ ప్లేసర్ మిషన్లకు కీపింగ్ వర్క్స్, ఫోర్ వీలర్ ఆటో సర్వీసింగ్, ఆయిల్ మార్పిడి, 50 డబ్బాలు అవసరం.

స్వీపింగ్ మిషన్లకు సైడ్, మధ్యలోని బ్రష్‌లు అరిగి పోయాయి. హైడ్రాలిక్ విధానం పని చేయడం లేదు. మోటార్లు రిపేర్ చేయించాల్సి ఉండగా సైడ్ రబ్బర్లు వేయించాలి.

ట్రాక్టర్ల ట్రాలీలు ఊడిపోతున్నాయి. వీటికి తాళ్లు కట్టుకొని చెత్తను తరలిస్తున్నారు. వెల్డింగ్ అవసరం. సెల్ఫ్ మోటార్లు, టైర్లు, బ్యాటరీలు, ఇంజిన్ రిపేర్, వైరింగ్ పనులు చేయించాల్సి ఉంది.

స్వచ్ఛ ఆటోలకు టైర్లు, ఆయిల్ మార్చడం, హైడ్రాలిక్ ఆయిల్, సర్వీసింగ్, కమాన్ పట్టీలు వేయించాలి.

డంపింగ్‌యార్డులో ఎక్స్‌లేటర్, ప్రొక్లెయిన్, బుల్డోజర్, బ్లేడ్ డోజర్ వాహనానికిఉండగా ఆయిల్ మార్చి బకెట్ పళ్లు బిగించాలి. గేర్ బాక్స్, డైనమో మార్చాలి. బ్లేడ్ ట్రాక్టర్‌కు ముందు, వెనుకాల టైర్లు తెప్పించాలి.

ఫాగింగ్ మిషన్లన్నింటికి ఏదో ఒక ఇబ్బంది ఉంది.

జెట్టింగ్ మిషన్ ఒక్కటే ఉండగా అదీ 60 డివిజన్లకు సరిపోవడం లేదు. ఇలాంటివి మరో నాలుగు అవసరం. భూగర్భ డ్రైనేజీ క్లీనింగ్ దీంతోనే చేస్తున్నారు. 30 మీటర్ల స్ప్రింగ్ పైపు, జెట్ నౌజల్ అవసరం. మరమ్మతుల షెడ్డులో పలు రకాల మెకానిక్ పనిముట్లు, హైడ్రాలిక్, సాధారణ జాకీలు, పంక్చర్ కిట్ అవసరం.

# పంట ఉత్పత్తుల సేకరణలో అతివలు



జగిత్యాల : స్వశక్తి మహిళా సంఘాల మధ్యవర్తిత్వంతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా జగిత్యాల జిల్లాలో ఈ సీజన్‌లో నువ్వులు, మక్కలు, మామిడికాయలు తదితర పంట ఉత్పత్తులను సేకరించేలా గ్రామీణాభివృద్ధిశాఖ(టీసెర్ప్) అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే 2,500 మందికిపైగా మహిళా రైతులు రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీవో)లో సభ్యత్వం తీసుకోగా వీటి ద్వారానూ ఉత్పత్తుల కొనుగోలుకు చర్యలు చేపట్టనున్నారు.

తొలిసారి నువ్వుల కొనుగోలుకు చర్యలు

పంట ఉత్పత్తుల కొనుగోలు మధ్యవర్తిత్వంతో కమీషన్ చేతికంది మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతమవుతాయి. మరోవైపు పల్లెచెంతనే విక్రయ అవకాశాలు పెరిగి కనీస మద్దతు ధరతో రైతులకూ లాభదాయకంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో టీసెర్ప్ రాష్ట్ర అధికారులు జిల్లా రైతులు, కొనుగోలుదారులతో ఇటీవలే పలుమార్లు సమావేశాలు జరిపి దినుసుల సేకరణకు సిద్ధమయ్యారు. జిల్లాలో ఈ సీజన్‌లో 2.98 లక్షల ఎకరాల్లో వరి, 32 వేల ఎకరాల్లో మక్క, 20 వేల ఎకరాల్లో నువ్వు పంటలను సాగుచేశారు. ధాన్యాన్ని టీసెర్ప్‌తో పాటు ప్యాక్స్‌లు, మెప్మా, రైతు సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేస్తుండగా తొలిసారి నువ్వులను కొనుగోలు చేయనున్నారు. 34 వేల ఎకరాల్లో మామిడి సాగుచేస్తుండగా సాధారణ పరిస్థితుల్లో 1.30 లక్షల టన్నుల దిగుబడి ఉంటుంది. ఉత్తర తెలంగాణలోనే పెద్దదైన మామిడి మార్కెట్ చల్‌గల్‌లో ఉండగా జగిత్యాలతో పాటు ఇతర జిల్లాలకు చెందిన మామిడి రైతులు ఇక్కడికి కాయలను తీసుకుకొస్తారు. ధరల తగ్గుదల, కాయల్లో తరుగు, కోతలు, క్యాష్‌కటింగ్ తదితరాలు రైతులతో పాటు మామిడి తోటల గుత్తేదారులను వేధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా సంఘాలతో పాటుగా ఉద్యానశాఖ, అపెడ ద్వారా మామిడి కాయలను సేకరించి ఎగుమతి చేయటం కర్షకులకు ఉపకరించనుంది.

మాల్స్‌కు వెయ్యి క్వింటాళ్ల మామిడి

జిల్లాలో గత సీజన్లలో వెయ్యి క్వింటాళ్లకుపైగా మామిడి కాయలను మహిళా సంఘాల ద్వారా సేకరించి మాల్స్‌కు పంపించారు. సంఘాలు, ఎఫ్‌పీవోల ద్వారా సంఘ సభ్యులైన రైతులు, ఇతర రైతుల నుంచి మామిడి కాయలను సేకరించి కొనుగోలుదారుకు చేరవేస్తారు. వచ్చిన కమీషన్‌ను సంఘాల్లోని సభ్యులకే పంచుతారు. మామిడి సేకరణకు అవసరమైన సామగ్రిని తీసుకోగా ఎంపిక చేసిన రైతుల తోటల వద్దే సేకరణ జరుపుతారు. బరువును బట్టి 3 గ్రేడులుగా విభజించి కాయలను సేకరించి మూడునాలుగు రోజుల్లో చెల్లింపులు జరుపుతారు. కొనుగోలు చేసిన మామిడి కాయలను మేడ్చల్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లోని రిపెనింగ్ ఛాంబర్లకు తీసుకెళ్లి మాగిన తర్వాత కార్పొరేట్ కంపెనీలు, మాల్స్‌కు ఒప్పందంపై ఇవ్వనున్నారు. జిల్లాలో ఉత్పత్తిచేసిన మామిడికి నాణ్యత, రుచి రీత్యా మంచి డిమాండ్ ఉంది. కాల్షియంకార్బైడ్‌తో మాగిన మామిడి కాయలు ఆరోగ్యానికి చేటు చేస్తున్నందున ఇథలీన్ గ్యాస్‌ఛాంబర్లలో మాగేసిన పండ్లను మాత్రమే మార్కెటింగ్‌కు ప్రభుత్వం అనుమతించింది. ఈ నేపథ్యంలో జగిత్యాల మార్కెట్‌లోని రైపెనింగ్ ఛాంబర్‌ను అందుబాటులోకి తెచ్చి రైతులు, మహిళా సంఘాలు నేరుగా మామిడి కాయలను విక్రయించేలా చర్యలను చేపట్టాలి. దీనిపై డీపీఎం వెంకటేశం మాట్లాడుతూ ఈ సీజన్‌లో మామిడితోపాటు నువ్వులు, మక్కలు తదితర ఉత్పత్తులను సేకరించనున్నట్లు వివరించారు.

# నీరు ఒడిసిపడితేనే భవిత

భువనగిరి : వాన నీటి సంరక్షణ వ్యవస్థలపై నిర్లక్ష్యం వహిస్తే బెంగళూరులో నెలకొన్నటువంటి నీటి ఎద్దడి పరిస్థితులు రాష్ట్రంలోనూ నెలకొనే ప్రమాదం ఉందని బుధవారం హైకోర్టు హెచ్చరించింది. నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఇంకుడు గుంతలు లేని నిర్మాణాలను గుర్తించాలని తెలంగాణ జల, భూ, వృక్ష చట్టం అమలు చేయాలని, అర్బన్, స్థానిక సంస్థలు, గ్రామాల్లో సైతం వాననీటి సంరక్షణ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోనూ నీటి ఎద్దడి నెలకొంటున్న పరిస్థితుల కారణంగా విరివిగా ఇంకుడుగుంతల నిర్మాణాలు అనివార్యంగా మారాయి. అయితే ఏటా వానాకాలంలో ఇంటికో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని అధికారుల హడావుడి తప్ప గత కొన్నేళ్లుగా ఆ ఊసే కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,63,455



మంజూరుకాగా.. అందులో 99,235 పూర్తయ్యాయి. మిగతా ప్రారంభించిన వాటిలో 7,858 ప్రగతిలో ఉండగా.. మొత్తంగా రూ. 30.36 లక్షలు ఖర్చయినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇంకుడు గుంతలు తవ్వేందుకు ఇదే సరైన సమయం అయినందున అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛందసంస్థలు వీటి నిర్మాణాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భూగర్భ జలాల పెంపునకే ..

భూగర్భ జలాలను పెంపొందించి వృథా నీటిని అడ్డుకట్ట వేసేందుకు ఏడేళ్ల క్రితం ఇంకుడుగుంతల నిర్మాణాలకు ప్రభుత్వం పూనుకుంది. జాతీయ ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరు చేయగా, జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి దీని నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. గ్రామాల్లో స్వశక్తి సంఘాల మహిళలు ఇంటింటికీ వెళ్లి ఇంకుడుగుంతలపై అవగాహన కల్పించిన సంఘటనలు ఉన్నాయి. అయితే ఈసారికూడా పల్లెల స్వచ్ఛత కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపితే ఆశించిన స్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని, ఇదే సరైన సమయమని అధికారులు అంటున్నారు.

సంరక్షణ చర్యలూ తప్పనిసరి..

ఇంకుడుగుంతలోనికి చెత్తా చెదారం చేరకుండా జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా వర్షపునీరు, నిత్యం మనం వినియోగించుకునే నీరుద్వారా చెత్తచేరకుండా మొదట్లో జాలి అమర్చుకోవాలి. మధ్యభాగంలో మ్యాన్‌హోల్ ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి ఆరునెలలకు ఒకసారి గోళెంలో నిల్వ అయిన చెత్తను పారతో తొలగించాలి. ఇందుకు గోళెంపై తెరచుకునే మూత ఏర్పాటు చేసుకోవాలి. ఇలా నిర్మాణాలు, సంరక్షణ చర్యలు చేపడితే నూరుశాతం వృథా జలాలు భూమిలో ఇంకే అవకాశం ఉంటుంది.

ప్రయోజనాలు ఇవీ..వర్షపు నీటిని ఒడిసి పట్టడం వల్ల భూగర్భజలాలు సమృద్ధిగా పెరిగి భవిష్యత్తు తరాలకు నీటి కొరత ఏర్పడదు. మురుగు, గుంతలు లేక దోమలు, పందుల బెడద చాలా వరకు ఉండదు. వ్యాధులు ప్రబలవు. ప్రతి పంచాయతీ పరిధిలో మురుగుకాల్వ నిర్వహణ తగ్గిపోయి ఆర్థిక ఖర్చులు కొంతమేర తగ్గుతాయి. వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుంది. అయితే వీటి నిర్మాణాల్లో 1.2 మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పు, 1.8 మీటర్ల లోతు తవ్వి, అందులో 20, 40 ఎంఎం సన్న, దొడ్డు కంకరతోపాటు ఇసుకను పోయాలి. వర్షపు నీరు నిత్యం ఇళ్లలో వాడే మురుగు నీరు నేరుగా గుంతలోకి వచ్చేలా పైపులైన్ ద్వారా ఏర్పాటు చేసుకోవాలి. మురుగునీరు శుభ్రం కావడమేకాక వర్షపునీరు భూమిలో ఇంకుతుంది. దీనివల్ల బావులు, బోర్లలో సమృద్ధిగా జలమట్టం పెరుగుతుంది.

# చిన్నవి చిక్కాయి.. పెద్ద చేప తప్పించుకుంది!

హైదరాబాద్: జలమండలిలో తాజాగా జరిగిన అవినీతి నిరోధక శాఖ దాడుల్లో పెద్ద చేప తప్పించుకుందనే చర్చ జరుగుతోంది. శుక్రవారం సీజీఎం రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ (ఫైనాన్స్) ఎల్. రాకేష్, మరో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సందీప్ రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడటం తెలిసిందే. తొలుత అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సందీప్ సంబంధిత వ్యక్తి నుంచి డబ్బులు తీసుకొని రాకేష్‌కు అందించారు. ఈ సమయంలోనే ఏసీబీ అధికారులు దాడులు చేసి రాకేష్ నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిలో ఓ పెద్ద చేపకు ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. ట్యాంకర్ బిల్లులు చెల్లింపుతోపాటు రెన్యువల్ చేయాలంటే ఒక సీనియర్ అసిస్టెంట్ సాయిలో తీసుకునే నిర్ణయం కాదని, దీని వెనుక వేరే అదృశ్య హస్తం ఉన్నట్లు చెబుతున్నారు. పెద్ద చేప చెప్పినట్లు చేసి చిన్న చేపలు ఏసీబీ వలలో చిక్కుకున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి రూ. 1.7 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు. రూ. లక్ష అడ్వాన్సు కింద చెల్లిస్తుండగా.. ఏసీబీ వలపన్ని పట్టుకుంది. ప్రతి పనికి వసూలు చేస్తుంటారనే పేరు పెద్ద చేపకు ఉంది. జలమండలి 650 పైగా అద్దె ట్యాంకర్లను తీసుకొని నడిపిస్తోంది. ఏటా అద్దెను రెన్యువల్ చేయాలి. రెన్యువల్‌తోపాటు అద్దెలు చెల్లింపులో కొందరు కింది స్థాయి నుంచి ఆపై అధికారులకు ముడుపులు చెల్లించుకోవాలి.

ఓపీటీలు తెలుసుకొని గృహ అవసరాలకు అని చెప్పి కొందరు ట్యాంకర్ యజమానులు వాణిజ్య అవసరాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో కొంత మొత్తం నిర్వాహకులకు జలమండలి కమీషన్ కింద చెల్లిస్తుంది. పలువురు ట్యాంకర్ల నిర్వాహకులు డొమెస్టిక్ కింద ట్యాంకర్ తీసుకొని వాణిజ్య అవసరాలకు తరలిస్తున్నారు. ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే ఓటీపీ సంబంధిత వినియోగదారుడికి పోతుంది. ఓటీపీ చెప్పిన తర్వాతే ట్యాంకర్‌ను సరఫరా చేస్తారు.




బెంగళూరు: రామేశ్వరం కెఫే బాంబు పేలుడు కేసులో నిందితుడికి సంబంధించిన ప్రాంతం గురించి కేంద్రమంత్రి శోభా కరంద్లాజే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దాంతో మంత్రి క్షమాణలు చెప్పాల్సివచ్చింది.

తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు పోస్టు పెట్టారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? నిందితుడు మల్నాడు వాసి అని, గతంలో తమిళనాడులోని కృష్ణగిరి అటవీ ప్రాంతంలో ఆయుధాలను వినియోగించడంలో ఇచ్చే శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నాడని ప్రాథమికంగా తేలింది. దాంతో మంత్రి చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అనుసరిస్తోన్న బుజ్జగింపు రాజకీయాలే కారణమంటూ విమర్శలు చేశారు. ఈ ఆరోపణలపై స్టాలిన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమెపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన వ్యాఖ్యలు దుమారం రేపడంతో సామాజిక మాధ్యమాల వేదికగా ఆమె క్షమాపణలు తెలియజేశారు. 'నేను చేసిన వ్యాఖ్యలు ఏ ఒక్క వర్గాన్ని ఉద్దేశించినవని కాదని తమిళనాడు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అనుకుంటున్నాను. కృష్ణగిరిలో శిక్షణ పొందిన నిందితుడిని ఉద్దేశించే నేను మాట్లాడాను. అయితే నా మాటలు కొందరిని బాధించాయని అర్థమైంది.

అందుకు క్షమాపణలు తెలియజేస్తున్నాను. నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నాను' అని ఆమె పోస్టు పెట్టారు. ఈ నెల ఒకటో తేదీన బెంగళూరులోని బ్రూక్‌ఫీల్డ్‌లో ఉన్న రామేశ్వరం కెఫేలో బాంబు పేలిన ఘటనలో 9 మంది గాయపడిన సంగతి తెలిసిందే.

# కాంగ్రెస్‌లో చేరిన మహబూబ్‌నగర్ జడ్పీ ఛైర్‌పర్సన్



హైదరాబాద్: మహబూబ్‌నగర్ జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లోకి నేతల వలసలు పెరిగాయి. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి తదితరులు ఆ పార్టీలో చేరారు.

# ట్యాపింగ్ తీగ లాగితే.. హైకోర్టులో ప్రణీత్ రావు పిటిషన్

హైదరాబాద్: మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నాలుగో రోజు విచారణ కొనసాగుతోంది. విచారణలో భాగంగా ప్రణీత్ రావు నుంచి కీలక విషయాలు రాబడుతోంది దర్యాప్తు బృందం. ఈ క్రమంలో ప్రణీత్ రావు మరికొందరు అధికారుల పేర్లను వెల్లడించినట్లు తెలుస్తోంది. దీంతో.. ఆ అధికారులకు నోటీసులు ఇచ్చి, వారిని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇక విచారణలో ప్రణీత్ రావు..ఫోన్ ట్యాపింగ్ కోసం విదేశాల నుంచి ప్రత్యేక సాఫ్ట్ వేర్, పరికరాలు తీసుకువచ్చి వాడినట్టు ఒప్పుకన్నారు. అయితే టెలిఫోన్ సర్వీసులకు సంబంధం లేకుండా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డట్టు గుర్తించారు. అందుకోసం విదేశాల నుంచి ప్రత్యేక సాఫ్ట్ వేర్ తెప్పించింది ఎవరు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కానీ ప్రణీత్ రావు మాత్రం విచారణ ఈ ఫోన్ ట్యాపింగ్ అధికారుల ఆదేశాల మేరకు చేశానని చెబుతుండటం గమనార్హం. దీంతో ఈ కేసులో మరొకందరిక నోటీసులు, కీలక అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ట్యాపింగ్ కేసు నిందితుడు ప్రణీత్‌రావు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ విచారణ జరగనుంది. కస్టడీ విషయంలో సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ పాటించడం లేదని.. కస్టడీ ముగిసిన వెంటనే జైలుకు తరలించేలా





ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. అలాగే.. తనకు సరైన సదుపాయాలు కల్పించడం లేదంటూ పిటిషన్‌లో ఆరోపించారు.

ఈ నేపథ్యంలో హైకోర్టు ఇప్పటికే పోలీసుల నుంచి వివరణ కోరింది. మరోవైపు.. తనను దర్యాప్తు చేస్తున్న టీంలో ఇంటలిజెన్స్ అధికారులతో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, అలాగే SIB అడిషనల్ ఎస్పీ రమేష్ విచారణలో పాల్గొనకుండా ఆదేశాలు ఇవ్వాలని ప్రణీత్ రావు కోరడం గమనార్హం.

# సీపీఐ నారాయణకు ప్రమాదం



**హైదరాబాద్: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ప్రమాదానికి గురయ్యారు. ఈ నెల 16వ తేదీన ఓ వివాహ వేడుకకు హాజరైన ఆయన వేదిక ఎక్కబోతుండగా.. జారిపడ్డారు. ఆ తర్వాత అదేం పట్టించుకోకుండా మాములుగానే తన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తర్వాత నొప్పి ఎక్కువ కావడంతో ఆయన వైద్యుల్ని సంప్రదించడంతో ఆయన గాయపడినట్లు తేలింది. నారాయణకు రిబ్ ఎముక విరిగిందని.. రెండు వారాల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది.**

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194



# తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం

హైదరాబాద్: తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రస్తుతం ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్.. అదనంగా తెలంగాణ బాధ్యతలు స్వీకరించారు. తమిళిసై రాజీనామా నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆయన్ను నియమించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. 1957 మే 4న జన్మించిన సీపీ రాధాకృష్ణన్.. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు భాజపా తరుపున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డ్ ఛైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు భాజపా సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి ఝార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

రెండు చోట్లా పూర్తిస్థాయి గవర్నర్లను నియమించేంత వరకూ సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు నిర్వర్తిస్తారని రాష్ట్రపతి కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకు తెలంగాణ గవర్నర్లుగా పనిచేసిన ఈఎస్ఎల్ నరసింహన్, తమిళిసై సౌందరరాజన్‌తోపాటు ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన సీపీ రాధాకృష్ణన్.. ముగ్గురూ తమిళనాడు వారే కావడం గమనార్హం.

# పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి.. పంట నష్టంపై ఏదీ?: కేటీఆర్

హైదరాబాద్: రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత చిన్నచూపు అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ (ట్విటర్) వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోలేదని.. వడగళ్లు ముంచెత్తినా కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. "దిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు తప్ప.. గల్లీలో రైతుల కన్నీళ్లు కనిపించవా? వాళ్ల ఆర్తనాదాలు వినిపించవా? ఎన్నికల గోల తప్ప.. ఎన్నో కష్టాలు పడుతున్న శ్రామికులపై కనికరం లేదా? సీట్లు, ఓట్ల పంచాయితీ తప్ప.. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా? ప్రజాపాలన అంటే 24/7 ఫక్తు రాజకీయమేనా? పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి.. పంటనష్టంపై లేదెందుకు? దెబ్బతిన్న పంటలను పరిశీలించే తీరిక లేదా? హైకమాండ్ చుట్టూ చక్కర్లు కొడుతున్న మీకు.. రైతుల సమస్యలు వినే ఓపిక లేదా? ఇంతకాలం పచ్చని పైర్లు ఎండుతున్నా.. సాగునీరు ఇవ్వడం చేతకాలేదు. ఇప్పుడు



నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలన్న మనసు రావడం లేదా? అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై భారాస పోరాడుతూనే ఉంటుంది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# మళ్లీ భాజపాలో చేరిన మాజీ గవర్నర్ తమిళిసై



చెన్నై: తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మళ్లీ భాజపాలో చేరారు. చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆమెకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తమిళనాడు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితరులు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రెండు రోజుల్లోనే గవర్నర్ పదవికి తమిళిసై రాజీనామా చేశారు. మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఇందుకు ఆమోదం తెలిపారు. ఆమె తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తారని గత కొంతకాలంగా ప్రచారం జరిగింది. దాన్ని నిజం చేస్తూ నేడు భాజపాలో చేరారు. దక్షిణ చెన్నై లేదా పుదుచ్చేరిలో ఏదైనా ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉంది. గవర్నర్ పదవి చేపట్టకముందు తమిళనాడు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆమె పనిచేశారు.

## లోక్‌సభ ఎన్నికలకు ఒంటరిగానే సీపీఎం.. భువనగిరి అభ్యర్థిగా జహంగీర్



హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుకు దూరంగా ఉన్న సీపీఎం.. లోక్‌సభ ఎన్నికలకు ఒంటరిగానే వెళ్లాని నిర్ణయించుకుంది. బుధవారం జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు.. భువనగిరి అభ్యర్థిగా జహంగీర్‌ను ప్రకటించిన సీపీఎం మిగతా స్థానాలకు త్వరలోనే అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని తెలిపింది.

# లిక్కర్ కేసులో బోయినపల్లి అభిషేక్‌కు బెయిల్

ఢిల్లీ: లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా ఉన్న బోయినపల్లి అభిషేక్ రావుకు స్వల్ప ఊరట లభించింది. సుప్రీం కోర్టు బుధవారం అభిషేక్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అభిషేక్ భార్య అనారోగ్యంతో ఉందన్న కారణంగా ఐదు వారాల బెయిల్‌ను మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చింది. అభిషేక్‌ను హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతించిన సుప్రీం కోర్టు.. పాస్‌పోర్టును సరెండర్ చేయాలని.. ఆయన ఫోన్ నెంబర్ ఈడీ అధికారులకు ఇవ్వాలని, అలాగే ఆయన భార్యకు హైదరాబాద్‌లోనే చికిత్స అందించాలని షరతులు విధించింది. అలాగే మిగిలిన బెయిల్ నిబంధనలను ట్రయల్ కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంటుందని తెలిపింది. ఈ సందర్భంగా.. ట్రయల్ కోర్టు విచారణపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈడీ కేసుల్లో ట్రయల్స్ జాప్యంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్రయల్స్ జాప్యం జరిగితే నిందితులు నెలల తరబడి జైల్లోనే ఉండాల్సి వస్తుంది





కదా? అని ప్రశ్నించింది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది. లిక్కర్ స్కామ్‌లో 2022 అక్టోబర్‌లో అభిషేక్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# తూత్తుకుడి స్థానంలో కనిమొళి, నీలగిరి నుంచి రాజా: అభ్యర్థులను ప్రకటించిన డీఎంకే

చెన్నై: సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటికే షెడ్యూల్ విడుదల కావడంతో ఓటర్లపై పార్టీలు వరాలు జల్లు కురిపిస్తున్నాయి. అదే సమయంలో లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. తమిళనాడులో అధికార, ప్రతిపక్ష పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకే తమ అభ్యర్థులను ప్రకటించాయి.

డీఎంకే నేతల సమక్షంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మేనిఫెస్టో విడుదల చేశారు. పుదుచ్చేరికి రాష్ట్ర హోదా, నీట్ పరీక్షలపై నిషేధం వంటి వాగ్దానాలను అందులో ప్రస్తావించారు. అలాగే రాష్ట్ర ప్రజల కోసం ప్రత్యేక పథకాలు ప్రకటించామని చెప్పారు. "2014లో అధికారంలోకి వచ్చిన భాజపా పాలనలో దేశం వెనకబడింది. వారు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదు. ప్రతిపక్షాలు 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేశాయి. 2024లో మన కూటమి అధికారంలోకి వస్తుంది" అని స్టాలిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో ప్రధాని మోదీ చేస్తోన్న పర్యటనలపై స్పందిస్తూ.. "వరదల సమయంలో మోదీ పర్యటిస్తే సంతోషించేవాడిని" అని వ్యాఖ్యానించారు. 39 లోక్‌సభ స్థానాలకు గానూ 21 సీట్లకు డీఎంకే అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన సీట్లను కూటమిలోని మిత్రపక్షాలకు కేటాయించే అవకాశాలున్నాయి. కీలక నేతలైన కనిమొళి, దయానిధి మారన్‌ను తూత్తుకుడి, చెన్నై సెంట్రల్ నుంచి బరిలో దింపింది. కేంద్రమాజీ మంత్రి ఏ రాజా.. నీలగిరి నుంచి పోటీ చేయనున్నారు.

**కాంగ్రెస్.. 'పంచ'తంత్రం :** మరోపక్క.. అన్నాడీఎంకే తొలివిడతలో 16 మంది అభ్యర్థులను ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఈ జాబితా విడుదల చేశారు. ఏడు దశల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు తొలివిడత ఓటింగ్ ఏప్రిల్ 19న జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660